సాక్షి ములుగు

సోమవారం । 27 । జనవరి । 2025



పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

కాకతీయ యూనివర్సిటీ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. - 8లో▸



యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కేయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు.- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.1°/17.2°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మేడారంలో వైద్యసేవలు ప్రారంభం



ఎస్ఎస్ తాడ్వాయి: మండల పరిధిలోని మేడారంలో టీటీడీ కల్యాణ మండపంలో డీఎంహెచ్ఓ గోపాల్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరిగే మినీ జాతరకు ముందస్తుగా అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల వైద్యసేవల నిమిత్తం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని తాడ్వాయి వైద్యాధికారి ఆదెపు చిరంజీవి సందర్శించి భక్తులకు అందించనున్న వైద్య సేవలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఫిబ్రవరి 11వ తేదీ వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు భక్తులకు వైద్యసేవలు అందిస్తామన్నారు. అత్యవసర వైద్య చికిత్సలను తాడ్వాయి పీహెచ్‌సీలో అందిస్తామని తెలిపారు. అత్యవసర సేవల నిమిత్తం 108 అంబులెన్స్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. భక్తులు ఉచిత వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో డీపీఎం సంజీవరావు, ఎంసీహెచ్ వైద్యాధికారి శ్రీజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి



వెంకటాపురం(కె): ఇందిరమ్మ కమిటీలను తక్షణమే రద్దు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు కొమురం భీం పేరుతో కమిటీలను ఏర్పాటు చేసి ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం నియమించాలన్నారు. ఇందిరమ్మ కమిటీలను ఏజెన్సీలో ఏర్పాటు చేయవద్దని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆదివాసీలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అడవులను మరింత అభివృద్ధి చేయాలి



కాటారం: అడవుల్లో మొక్కల పెంపకం విరివిగా చేపట్టి అడవిని ఘనంగా అభివృద్ధి పరచాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ సూచించారు. కాటారం మండలం కొత్తపల్లి సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లాంటేషన్‌ను ఆదివారం పీసీసీఎఫ్ పరిశీలించారు. ప్లాంటేషన్ విస్తీర్ణం, చేపడుతున్న మొక్కల పెంపకం, మొక్కల రకాలపై ఆరా తీశారు. ప్లాంటేషన్‌లో నాటిన ప్రతి మొక్క చెట్టుగా ఎదిగేలా చూడాలని, మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్లాంటేషన్ నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించి అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. పీసీసీఎఫ్ వెంట కాళేశ్వరం సీసీఎఫ్ ప్రభాకర్, భూపాలపల్లి డీఎఫ్ఓ నవీన్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నలిగిన వలస బతుకులు

పొట్టకూటి కోసం వస్తే నలుగురి ప్రాణం పోయింది

ప్రమాద ఊహాచిత్రం

కొంతముందుకు రాగానే ఆటోను ఢీకొట్టి బ్రేక్ వేయడంతో కుడివైపునకు ట్రక్కు తిరిగి రహదారిని బ్లాక్ చేసింది. ఓవర్ స్పీడ్‌కు సడెన్ బ్రేక్ వేయడంతో ఆ ట్రక్కులోని ఇనుప స్తంభాలకు ఉన్న తాడు తెగి స్తంభాలు ఎగిరి ఎడమ, కుడివైపున ఉన్న ఆటోలపై ఒక్కసారిగా పడ్డాయి.

బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలో ట్రక్కు ఓ లారీని ఢీకొనబోయింది.

ట్రక్కు.. కక్కిరాలపల్లి నుంచి పంథినికి ఎరువు బస్తాలు తీసుకొస్తున్న ఆటోను ఢీకొట్టడంతో అది బోల్తా పడి డ్రైవింగ్ చేస్తున్న చిర్ర రాజేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడున్న వారు ట్రక్కును ఆపే ప్రయత్నం చేశారు.





బోల్తా పడిన భారీ ట్రేలర్ ట్రక్



ఆటో కింద ఇరుక్కుపోయిన ఆటో డ్రైవర్ రాపర్తి సాగర్

- ఐదు రోజులక్రితమే మామునూరుకు వచ్చిన కుటుంబం
- వ్యవసాయ పనిముట్లు చేస్తూ జీవనోపాధి
- ట్రేలర్ ట్రక్ రూపంలో కబళించిన మృత్యువు
- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్ ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు..

పొట్టకూటి కోసం ఐదు రోజులక్రితమే రాష్ట్రం విడిచి వచ్చారు. దేరాలు వేసుకుని ఇనుప పనిముట్లు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. మరో ఊరిలో వీటికి గిరాకీ బాగుందని తెలుసుకున్న ఆ కుటుంబం ఆటోలో వెళ్తుండగా బయల్దేరిన పది నిమిషాల్లో18 టైర్లతో కూడిన ట్రేలర్ ట్రక్ మృత్యు రూపంలో దూసుకొచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు విగతజీవులయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్‌కు చెందిన నువురు సంతోశ్‌చౌహాన్ (45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్ (20), కిరణ్ చౌహాన్ (18), కుమారుడు ఖన్నా చౌహాన్ (7)గా గుర్తించారు. సంతోశ్ భార్య చామాబాయి, కుమారుడు ముఖేశ్ చౌహాన్‌తో పాటు ఆటోడ్రైవర్లు ఎండీ షకీర్, రాపర్తి సాగర్, చిర్రరాజుకు గాయాలయ్యాయి.

- సాక్షి, వరంగల్ - పూర్తి వివరాలు 8లో▸



రోడ్డు పక్కన పడిపోయిన ఆటో, ఐరన్ రాడ్లు



మృతుడిని తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

సమగ్రాభివృద్ధే లక్ష్యం

అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

- మినీ మేడారం జాతరను విజయవంతం చేద్దాం
- ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలి
- కలెక్టర్ టీఎస్.దివాకర
- జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో గణతంత్ర వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు: జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ టీఎస్.దివాకర తెలిపారు. జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 76వ గణతంత్ర వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో పోలీస్‌శాఖ తరఫున గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఎస్పీతో కలిసి పరేడ్ నిర్వహించిన అనంతరం కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశభక్తి గేయాలతో విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 6,123 మందికి రూ.13.69కోట్లతో లబ్ధి చేకూరిందన్నారు. జాతీయ సికిల్ సెల్ ఎనిమియా నిర్మూలనకు 44,933 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేయించామని తెలిపారు. ఇందులో 14మందికి మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది 3,947 మంది గర్భిణుల పేర్లు నమోదు కాగా 3,013 మందికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసి ములుగు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గతేడాది నవంబర్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించుకుని 50మంది వైద్య విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ 41 మంది బోధనేతర సిబ్బందితో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. నర్సింగ్ కళాశాలకు 60 సీట్లు మంజూరు కాగా 56మంది విద్యార్థినులు అడ్మిషన్లు పొందారని తెలిపారు. డీఎస్సీలో 177 మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారని వివరించారు. మహాలక్ష్మీ పథకం కింద జిల్లాలో 80.57లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు.

బస్‌డిపో.. బస్టాండ్ల నిర్మాణాలకు..

భవిష్యత్ అవసరాలకు గానూ ఏటూరునాగారంలో రూ.6.28 కోట్లతో బస్‌డిపో, ములుగులో రూ.5.11 కోట్ల నిధులతో మోడల్ బస్టాండ్, మంగపేటలో రూ.52 లక్షలతో బస్టాండ్‌ను నిర్మిస్తున్నామన్నారు. 26, 811 మంది రైతులకు రూ.219.97కోట్ల రుణమాఫీ అయ్యిందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 1,33,681 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 19,133 మంది రైతులకు రూ.273.02కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. గృహజ్యోతి పథకం ద్వారా జిల్లాలో 39,711 విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు అందించి రూ.11.28కోట్లు లబ్ధిదారులకు సబ్సిడీ కల్పించామన్నారు. సీఎం కప్ పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలలో కరాటే, బాక్సింగ్, అథ్లెటిక్స్, రెజ్లింగ్ పోటీలలో క్రీడాకారులు 12పతకాలను సాధించారని వెల్లడించారు.

మినీ మేడారానికి నిధులు

ఫిబ్రవరి 12నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న మినీ మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడానికి 10శాఖల తరఫున రూ.533.45కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. మెరుగైన వసతుల కల్పనకు 69రకాల పనులను మేడారంలో చేపడుతున్నట్లు వెల్లడించారు.

నాలుగు పథకాల అమలుకు పటిష్ట చర్యలు

రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నాలుగు పథకాల అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేదలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయి విచారణ నిర్వహించామన్నారు. అనంతరం ఈ నెల 21వ తేదీ నుంచి 24వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి జాబితాలో పేర్లు లేని అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. సంక్షేమ పథకాలు అమలు నిరంతర ప్రక్రియ అన్నారు. పోలీస్‌శాఖ తరఫున జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించి, పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేశామని వివరించారు. రూ.14 లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకుని 43 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. ప్రజలు పర్యాటకుల రక్షణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు, నేరస్తుల గుర్తింపుకు జాతీయ రహదారి వెంబడి 370పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గిరిజన మారుమూల ప్రాంతమైన బంధాల గ్రామంలో ప్రజల సౌకర్యార్థం పోలీసుల ఆధ్వర్యంలో ఎయిర్‌టెల్ నెట్వర్క్‌ను ఏర్పాటు చేసిందన్నారు. వరదల సమయంలో ముందస్తు చర్యలు తీసుకోవడంతో ప్రాణనష్టం చోటుచేసుకోకుండా చూశామని వివరించారు.



స్టాల్స్ పరిశీలించిన మంత్రి సీతక్క, కలెక్టర్

ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క హాజరై ఆయా శాఖల తరఫున ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అధికారుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మహేష్ బాబా గీతే, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్లు సీహెచ్. మహేందర్‌జీ, సంపత్‌రావు, అదనపు ఏఆర్ ఎస్పీ సదానందం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఆర్డీఓ వెంకటేశ్, ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్



75 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ

మంగపేట: మండల పరిధిలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని బానోతు బాలాజీ ఆధ్వర్యంలో ఆదివారం 75మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా పాఠశాల ఆవరణలో పరుచూరి శ్రీనివాసరావు జ్ఞాపకార్థంగా రూ.2లక్షలతో నిర్మించిన వేదిక(స్టేజ్)ను ఆయన సతీమణి శివాని ప్రారంభించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క

ములుగు రూరల్/వెంకటాపురం(ఎం)/గోవిందరావుపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ములుగు మండల పరిధిలోని జీవంతరావుపల్లి, వెంకటాపురం(ఎం) మండలంలోని లింగాపూర్, గోవిందరావుపేట మండలంలోని రాఘవపట్నంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు మంత్రి సీతక్క కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి హాజరై తొలుత సీఎం రేవంత్‌రెడ్డి సందేశంతో కూడిన వీడియోను ప్రదర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం నాలుగు రోజుల పాటు గ్రామసభలు నిర్వహించి నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించి అర్హుల జాబితాను ప్రజల ముందు ఉంచామని తెలిపారు. అర్హుల జాబితాలో పేర్లు లేని అర్హులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని వివరించారు. విడతల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాలను అందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం 10సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ఆరు గ్యారంటీలను అమలు చేశామని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేకున్నా పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు మండల ప్రత్యేక అధికారి కొమురయ్య, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి ఫైజల్ హుస్సేన్, తహసీల్దార్ విజయ భాస్కర్, వెంకటాపురం(ఎం) తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీఓ రాజు, గోవిందరావుపేట డీఏఓ సురేష్‌కుమార్, తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీడీఓ జవహర్ రెడ్డి స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జీవంతరావుపల్లిలో అర్హులకు సంక్షేమ పథకాల పత్రాలు అందిస్తున్న మంత్రి, కలెక్టర్

మేడారంలో భక్తుల సందడి



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారమ్మలను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. మేడారం మినీ జాతరకు 15 రోజుల గడువే మిగిలింది. ముందస్తుగా మొక్కులు చెల్లించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర సారె, ఎత్తు బంగారం, ఒడి బియ్యం కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకున్నారు. ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్‌లు రఘుపతి, జగదీశ్, మధులు భక్తులకు సేవలదించారు. సుమారుగా 10వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

భక్తుల స్నానాలకు రూ.10 వసూలు

జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద ఒక్క షవర్ మాత్రమే ఉండటంతో భక్తులు స్నానాలు చేసేందుకు పడుతున్న ఇబ్బందులు గమనించిన ఓ రైతు తన పొలంలోని బోరు నుంచి స్నానఘట్టాల వద్దకు నీటి వసతి కల్పించాడు. ఈ క్రమంలో ఒక్కొక్క భక్తుడు స్నానం చేసేందుకు రూ.10 వసూలు చేయడం కనిపించింది. మినీ జాతర సందర్భంగా ఇప్పటికే బుధ, గురు, శుక్ర, ఆదివారాల్లో భక్తుల తాకిడి భారీగానే ఉంటుంది. ఈ క్రమంలో జంపన్న వాగులో భక్తులు స్నానాలు చేసేందుకు చుక్కనీరు లేకపోగా ఏర్పాటు చేసిన ఒక షవర్‌కు పది ట్యాప్‌లు మాత్రమే ఉండటంతో భక్తులు స్నానాలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మంత్రులు సురేఖ, సీతక్కలు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి భక్తులకు స్నానాలు చేసేందుకు నీటి వసతి కల్పించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. అయినా అధికారులు ఏర్పాట్లు చేయకపోవడంతో రైతు ఏర్పాటు చేసిన బోరు పైపు వద్ద స్నానాలు చేసేందుకు భక్తులు వెనకాడలేదు.



వ్యవసాయ రైతు బోరు మోటార్ వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో 76వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ఆదివారం జాతీయ జెండాను పీఓ ఎగురవేశారు. ముందుగా స్కాట్ అండ్ గైడ్స్, పోలీసులు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఓ మాట్లాడారు. ఐటీడీఏ ద్వారా మినీ మేడారం కోసం రూ.5.33 కోట్లతో 69 రకాల పనులు చేపట్టామన్నారు. పూజారులు, వడ్డెలు ఫిబ్రవరి 12నుంచి 15 వరకు మినీ మేడారం జాతరను నిర్వహిస్తారని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇంజనీరింగ్ విభాగం ద్వారా 95 రకాల పనులను రూ.6.12 కోట్లతో పనులు చేపట్టగా అందులో 35పనులు పూర్తికాగా మిగతా 60పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని 117అంగన్‌వాడీ కేంద్రాలకు నీతి అయోగ్ పథకం ద్వారా ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.3.5లక్షల చొప్పున ఖర్చు చేసి పనులు చేపట్టామన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద రూ.7.4కోట్లతో 44 సబ్ సెంటర్స్ బిల్డింగ్ పనులు చేపట్టగా 35పనులకు పూర్తికాగా మిగతావి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఎస్‌టీడీఎఫ్ 2022–23లో 175రోడ్ల పనుల కోసం రూ.23.42 కోట్లు ఖర్చు చేసి 165 పనులు పూర్తి చేసినట్లు వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాంకేతిక నైపుణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పీఓ వెల్లడించారు. ఇందుకోసం కావాల్సిన పనిముట్లు, సబ్సిడీలు, ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఉత్తమ సేవలు అందజేసిన వారికి ప్రశంస పత్రాలను పీఓ అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో డీడీ పోచం, ఏఓ రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, ఈఈ వీరభద్రం, డీసీఓ శ్రీనివాస్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఎస్సై తాజొద్దీన్, సీడీపీఓ ప్రేమలత, జీసీడీఓ సుగుణ తదితరులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న పీఓ, అధికారులు

అవార్డులు అందజేత

ఐటీడీఏ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు పీఓ చిత్రామిశ్రా ప్రశంస పత్రాలను అందజేశారు. విద్యుత్ శాఖలో ఏఎల్ఎం అమరేందర్, ఎస్ఎస్‌తాడ్వాయి ఆశ్రమ పాఠశాల వార్డెన్ లక్ష్మీ, ఈఈ వీరభద్రంతో పాటు పలువురికి అందజేశారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న పీఓ చిత్రామిశ్రా



చిన్నారులతో నృత్యం చేస్తున్న పీఓ

క్లుప్తంగా

పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫెల్లోషిప్స్ కలిగిన విద్యార్థులు యూజీసీనెట్, సీఎస్ఐఆర్ నెట్, సీడ్, డీఎస్టీ, ఎన్ఈఎఫ్‌డబ్ల్యూడీ, డీఎస్టీ–ఇన్‌స్పైర్ లేదా ఎఫ్ఐపీ, క్యూఐపీ టీచర్ ఫెల్లోషిప్స్ తదితర నెట్, గేట్, జీప్యాట్ నేషనల్ లెవల్ టెస్ట్ స్కోర్స్ నెట్ కలిగిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలని సైన్స్ విభాగాల డీన్ ఆచార్య జి.హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన అప్లికేషన్లను సంబంధిత కార్యాలయంలో ఫిబ్రవరి 12 లోపు అందజేయాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.800 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బోటనీ 6, కెమిస్ట్రీ 3, జియాలజీ 1, మ్యాథ్‌మెటిక్స్ 5, ఫిజిక్స్ 2, జువాలజీ 11 సీట్లు ఉన్నాయని వివరించారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కేయూ క్యాంపస్: యువత మత్తుకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో మత్తు పదార్థాల నియంత్రణపై రెండ్రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాకు చెందిన యువత ఇందులో పాల్గొనగా.. ముగింపు సమావేశంలో ఈసం నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత తమలోని నైపుణ్యాలను వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి సమాజానికి ఉపయోగించుకోవాలన్నారు. రిసోర్స్‌పర్సన్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ కమ్యూనిటీ మొబలైజేషన్‌పై అవగాహన కల్పించారు. జిల్లా యువజన అధికారి చింతల అన్వేశ్, యాంటీ నార్కోటిక్స్ సీఐ రవీందర్, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సైకియాట్రిస్ట్ విభాగం డాక్టర్ సాయికిరణ్, ప్రొఫెసర్ మురళి, డాక్టర్ నవీన్, గణిత విభాగాధిపతి డాక్టర్ భారవిశర్మ, హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ ఎల్పీ రాజ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మధు, నెహ్రూ యువ కేంద్రం సూపరింటెండెంట్ బానోత్ దేవీలాల్, న్యాయవాది మహేందర్ పాల్గొన్నారు.

ఉత్తములకు ప్రశంసపత్రాలు



అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావుకు ప్రశంసపత్రం అందజేస్తున్న మంత్రి, కలెక్టర్

జిల్లాలో ఉత్తమ సేవలందించిన 237మంది ఉద్యోగులు ప్రశంస పత్రాలు అందుకున్నారు. జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 76వ గణతంత్ర వేడుకల్లో మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర వారికి ప్రశంస పత్రాలు అందజేసి సన్మానించారు. -ములుగు



కొమురయ్య, జిల్లా పశువైద్యాధికారి | మోహన్‌లాల్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ | దేవేందర్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ | శైలేందర్, కలెక్టర్ సీసీ | మహేశ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్



తుల రవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ | కొప్పుల మల్లేశం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ | బాలయ్య, ప్రొఫెసర్ | కవిత, ప్రొఫెసర్ | శ్రీకాంత్, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి | రాహీల్, పేరూరు డాక్టర్ | శోభారాణి, ఏఎన్ఎం | శ్రీదేవి, ఆశా కార్యకర్త | నూతన్, జూనియర్ అసిస్టెంట్ | ఉమా, సోషల్‌వెల్ఫేర్ | శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి | సురేష్, కంప్యూటర్ ఆపరేటర్



పాణిని, డీఈఓ | రఘు, జాకారం కారోబార్ | స్వామి, కలెక్టరేట్ అధికారి | వర్ష, సీనియర్ అసిస్టెంట్ | అరవింద్, సీసీ, డీఆర్డీఓ | చేరాలు, ఏఓ, మంగపేట | వెంకట్‌నారాయణ, ఏపీడీ | లక్ష్మారెడ్డి, ఎస్సై, ములుగు | రమాదేవి, కార్యదర్శి, ఏటూరునాగారం | సురేష్‌బాబు, డీటీ, ఎస్ఎస్ తాడ్వాయి | కమలాకర్, కమాటీ | శ్రీనివాస్, హెచ్‌డబ్ల్యూ, వాజేడు



కిరణ్, డీఎంహెచ్ఓ కార్యాలయ డీఈఓ | రమాదేవి, సూపర్ వైజర్ | ఇమ్రాన్, జూనియర్ అసిస్టెంట్ | నవీన్, కమాటీ | పాషా, అటెండర్, కలెక్టరేట్ | సతీశ్, మేడారం ఈఓ | నారాయణమూర్తి, పీసీ, పేరూరు | రాజేంద్రప్రసాద్, పీసీ | బాలయ్య, పీఏసీఎస్ సిబ్బంది, వాజేడు | పెంట రఘు, ఈఓ, ములుగు | పోలు రాజు, కార్యదర్శి, మల్లంపల్లి | దీప్తి, జూనియర్ అసిస్టెంట్, డీపీఓ కార్యాలయం



కిరణ్, ఈ డిస్ట్రిక్ట్ డీపీఎం | చరణ్, ఈ డిస్ట్రిక్ట్ ఆపరేటర్ | దశరథ్, టైపిస్ట్, వెంకటాపురం | గణేశ్, పారిశుద్ధ్య కార్మికుడు, తిమ్మంపేట | సంతోష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ | అశోక్, ఆర్ఎస్సై | అశోక్, బుస్సాపూర్ కార్యదర్శి | ప్రసాద్, తుపాకుల గూడెం కార్యదర్శి | జవహర్‌రెడ్డి, ఎంపీడీఓ, గోవిందరావుపేట | ధర్మేందర్, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఈఈ | మధుకర్, పస్రా కానిస్టేబుల్ | శరత్, ఎంపీఓ, గోవిందరావుపేట



క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క



కలెక్టరేట్‌లో జెండా వందనం చేస్తున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు



ఐటీడీఏలో నృత్యం చేస్తూ..

ఎస్సార్‌లో 'షణ్ముఖ ప్రియ' హంగామా

- ఆకట్టుకున్న ప్రదర్శన
- ఆదిరిన విద్యార్థుల ర్యాంప్‌వాక్
- ముగిసిన స్పార్కిల్ వేడుకలు



పాడుతున్న సింగర్ షణ్ముఖప్రియ

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్పార్కిల్ వేడుకలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా ప్రముఖ గాయని షణ్ముఖ ప్రియ బృందం హంగామా చేసింది. షన్ముఖ పాటలకు వేదిక కింద ఉన్న విద్యార్థులు స్టెప్పులు వేశారు. ముంబాయి సినిమాలోని 'హమ్మ .. హమ్మ' అనే పాటకు విద్యార్థుల కేరింతలతో ఆ ప్రాంతం మార్మోగింది. తొలుత కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు మంత్రముగ్ధులను చేశాయి. విద్యార్థుల ర్యాంప్ వాక్ ఆదిరింది. వివిధ వేషధారణలో విద్యార్థులు ర్యాంప్‌పై ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులతో మానసిక వికాసం పెంపొందుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, డాక్టర్ సుధాకర్, ప్రోగ్రాం కన్వీనర్లు శశిధర్‌రెడ్డి, వాణిశ్రీ, భావన తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న వరదారెడ్డి

ఉత్సాహంగా 'ఎట్ హోం'

హన్మకొండ అర్బన్: గణతంత్ర వేడుకల్లో భాగంగా హనుమకొండ కలెక్టర్ ఆధ్వర్యాన సంప్రదాయ బద్ధంగా నిర్వహించే ఎట్ హోం.. తేనీటి విందు కార్యక్రమం ఆదివారం రాత్రి కలెక్టరేట్‌లో ఉత్సాహంగా సాగింది. చిన్నారుల ఆటాపాటలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌బాబు, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా దంపతులు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీతానాజీ వాఖడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇతర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎట్ హోం కార్యక్రమంలో సీపీ, మున్సిపల్ కమిషనర్, కలెక్టర్

నలిగిన వలస బతుకులు

ట్రైలర్ ట్రక్ రూపంలో నలుగురిని కబళించిన మృత్యువు

- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్, ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారు..

సాక్షి, వరంగల్ : మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్ నగర్‌కు చెందిన నువురు సంతోశ్ చౌహాన్ కుటుంబానిది రెక్కాడితే గాని డొక్కాడనీ కుటుంబం. కత్తులు, కొడవళ్లు, గొడ్డలి, పారలతోపాటు ఇతర వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ జీవనాన్ని వెళ్లదీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఐదురోజుల క్రితం మామునూరుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన అతడి అన్న కొడుకు సుమీర్ కుటుంబం డేరా వేసుకొని జీవనం వెళ్లదీస్తుండడంతో వారి పక్కనే మరో డేరా వేసుకొని పని చేసుకుంటున్నారు. రెండు కుటుంబాలు ఒక్క దగ్గరే ఉంటుండడంతో వచ్చిన గిరాకీ కుటుంబ ఖర్చులకు సరిపోకపోవడంతో అక్కడికి వచ్చిన ఇతరుల ద్వారా లోహిత గ్రామానికి వెళ్లాలని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలోనే మామునూరు బెటా లియన్ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌కు కూతవేటు దూరంలో 18 టైర్లతో కూడిన ట్రైలర్ ట్రక్ అతివేగంతో అదుపుతప్పి ఆటోను ఢీకొట్టడంతో అందులో ఉన్న భారీ ఇనుప రాడ్లు ఎగిరి కాస్త ముందు ఉన్నమరో ఆటోపై ఎగిరిపడ్డాయి. ఈ ఘటనలో నువురు సంతోశ్ చౌహాన్(45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్(18), కిరణ్ చౌహాన్(18) అక్కడికక్కడే మరణించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కుమారుడు ఖన్నా (8) చనిపోయాడు. ఇనుపరాడ్లు పడడంతో మృతదేహాలు గుర్తుపట్టరాకుండా ఛిద్రమయ్యాయి.

మూడు జేసీబీలతో ఇనుపరాడ్ల తొలగింపు

ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులకు అప్పటికే ట్రక్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ట్రాఫిక్ జామైంది. దీనికితోడు ఇనుపరాడ్లు తీయడం సవాల్‌గా మారింది. సమీపంలోని మూడు జేసీబీలను తీసుకొచ్చారు. ఇటు ఆర్టీఓ జంక్షన్ వైపు హైవే రహదారిని మూసివేసి వాహనాలు రాకుండా చూశారు.



ప్రమాద స్థలంలో గుమిగూడిన ప్రజలు

నలుగురిని బలిగొన్న మద్యం మత్తు..

మామునూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ రాజస్తాన్ వాసి యోగిందర్ సింగ్ తీవ్ర మద్యం మత్తులో ఉన్నాడు. అతడికి పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్టు చేయగా 280 ఎంజీ/100 మిలీ రీడింగ్ నమోదైంది. ఇతడి వల్ల నలుగురి ప్రాణాలు పోయాయి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు అతివేగం, డ్రంకన్ డ్రైవ్ వల్లనే జరుగుతున్నాయని, తమకు ఏమాత్రం సంబంధంలేని వ్యక్తుల ప్రాణాలు తీస్తున్నారని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ అన్నారు. ఇలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆ జేసీబీల సాయంతో ఇనుప రాడ్లలో చిక్కుకున్న ఐదుగురు క్షతగాత్రులను బయటకు తీసేందుకు అరగంటకు పైగా సమయం తీసుకుంది. డీఆర్ఎఫ్ బృందాలు కూడా పనిచేశాయి. అప్పటికే సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌ల్లో వారిని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. ఆ తర్వాత రహదారికి అడ్డుగా ఉన్న ట్రైలర్ ట్రక్కును జేసీబీల సాయంతో ఎడమవైపునకు తోసేశారు. రహదారిపై పడి ఉన్న ఇనుప రాడ్లను కుడివైపున పడేశారు. ఆ తరువాత ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు గంటకుపైగా సమయం తీసుకుంది. ఘటనాస్థలిని కలెక్టర్ సత్యశారద, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు.

నిన్న వెళ్తే.. ఈ ఘోరం జరిగి ఉండేది కాదు..

మామునూరు ప్రధాన రహదారికి ఆనుకొని వీరు వేసుకున్న డేరా బోసిపోయింది. ఉదయం 11 గంటల వరకు సంతోషంగా ఉన్న ఆ ఫ్యామిలీ 20 నిమిషాల వ్యవధిలో ఘోర ప్రమాదం బారినపడడంతో అక్కడున్న వారు అయ్యో పాపం అని చర్చించుకోవడం కనిపించింది. 'ఐదు రోజుల పాటు అక్కడే ఆడుతూ పాడుతూ గడిపిన సంతోశ్ కుటుంబం శనివారం సాయంత్రమే లోహితకు వెళ్లాల్సి ఉండే. బొల్లికుంట మీదుగా వెళ్తే త్వరగా వెళ్లొచ్చని చెప్పాం. తెలిసిన వారు గవిచర్ల క్రాస్ నుంచి రమ్మని చెబుతున్నారనడంతో ఆటోను రూ.1,000లకు కిరాయి అడిగితే ఏమీ లేనివారని రూ.500లకు మాట్లాడించి పంపించాం. నిమిషాల వ్యవధిలోనే ఆ కుటుంబం రోడ్డు ప్రమాదం బారినపడడంతో మాకు కన్నీళ్లు ఆగడం లేదు' అని అక్కడే టైలర్ దుకాణంలో పనిచేసే ఓ వ్యక్తి వాపోయాడు.

రూ.200 డీజిల్ కొట్టించుకున్నారు...



ఆరుగురు ప్రయాణికులతో వెళుతున్న ఆటో మా పెట్రోల్ బంక్‌లో రూ.200 డీజిల్ పోయించుకున్నారు. ఫోన్ పే పనిచేయకపోవడంతో కాసేపు ఆగారు. చివరకు డబ్బులిచ్చి హైవేపైకి వెళ్లారు. నిమిషాల వ్యవధిలోనే ట్రైలర్ ట్రక్కు అతివేగంతో వచ్చి చేసిన ప్రమాదంతో వీరి ఆటో నుజ్జునుజ్జయింది. మేం పోయేసరికే ఆ ఇనుప రాడ్లు పడి అందులో చిక్కుకున్న వారి ఆర్తనాదాలు మాకు వినిపించాయి. ఆ ఇనుపరాడ్లు తీద్దామంటే బాగా బరువు ఉండడంతో తీయలేకపోయాం.

\- జాకీర్, పెట్రోల్‌బంక్ సిబ్బంది

గంట ముందు మాట్లాడా..



గంట ముందు వరకు నన్ను ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఇక్కడికి కొద్ది మీటర్ల దూరంలో ఉన్న లోహిత గ్రామానికి వెళుతున్నామని, వచ్చే ఆదివారం కలుసుకుందామని చెప్పారు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది.

\- సుమీర్, సంతోశ్ అన్న కుమారుడు

మెరుగైన వైద్యం అందించండి

- క్షతగాత్రులను పరామర్శించిన వరంగల్ కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం: మామునూరు వద్ద ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద ఎంజీఎం వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనను పరిశీలించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. కాగా, స్వల్ప గాయాలపాలైన ఆటో డ్రైవర్ షకీల్‌ను వైద్య చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.



ఘటనాస్థలిలో కలెక్టర్ సత్యశారద

మృతుల కుటుంబ సభ్యుల కోరిక మేరకు పోస్టుమార్టం పూర్తి చేసిన మృతదేహాలను, చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలెక్టర్ సత్యశారద ఆదేశాలతో ఎంజీఎం పరిలపాధికారులతోపాటు వరంగల్, ఖిలావరంగల్ తహసీల్దార్‌లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావులు దగ్గరుండి ప్రత్యేక అంబులెన్స్‌లో వారి స్వగ్రామానికి పంపించారు.

మంత్రి సురేఖ పరామర్శ..



క్షతగాత్రులను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ఆస్పత్రిలోని క్షతగాత్రులను సాయంత్రం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళీని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.